

# చైతన్యరాహిత్యంలో స్త్రీ

## – పవని నిర్మల ప్రభావతి

పద్నాలుగేళ్ళు అరణ్య వాసం చెయ్యటానికి బయల్దేరిన సీతారాములను లక్ష్మణుడు అనుసరించినప్పుడు అతని అర్ధాంగి ఊర్మిళ, భర్తను అనుసరించ లేకా, రాజాంతఃపురంలో జీవచ్ఛవంలా బ్రతకలేకా చైతన్య రాహిత్య స్థితిలోకి జారిపోయి దీర్ఘనిద్రను ఆశ్రయించింది.

ఆమెకా దుస్థితి కల్గించిన వారెవ్వరూ  ఆమె పట్ల జాలి చూపించ లేదు.

చరిత్ర కూడా ఆమె మానసిక పరిస్థితిని విశ్లేషించలేదు.ఈనాటి అధునాతన సమాజంలో కూడా ... పరిస్థితుల ప్రభావం వల్ల కొందరు స్త్రీలు ఎటువంటి చైతన్య రాహిత్య స్థితిని ఆశ్రయిస్తున్నారంటే అందుకు కారణం ఏమిటి?

మారుతున్న సమాజంలో కూడా స్త్రీలకు ఈ దుస్థితి తప్పక పోతే, ఇహ, అందరూ ఆశిస్తున్న 'మార్పు'కు అర్ధం ఏమిటి?

నేటి సాంఘిక సమస్యలను కథా వస్తువుగా తీసుకుని అతి హృద్యమంగా మలచిన శ్రీమతి పవని నిర్మల ప్రభావతి గారి రసవత్తర నవల "చైతన్య రాహిత్యంలో స్త్రీ"

ప్రతి ఒక్కరూ తప్పక చదివి తీరాల్సిన నవల ఇది.

*(గత సంచిక తరువాయి)*

ఊర్మిళ కుటుంబాన్ని చూస్తుంటే రామచంద్రానికి ఊర్మిళ పట్ల తగని జాలి కలిగేది.

"దేవుడి లీలలను ... మరోటను. ఏమిటో ఈ గందరగోళం ఊర్మిళా! నేను నీలోకి పరకాయ ప్రవేశం చేయగలిగితే ఈ మాలతిని తనని తగిలేద్దును. సీతను మీ ఇంటి ఛాయలకు రాకుండా కాళ్ళు విరగేద్దును. అనసూయమ్మ అత్త ఎలా నీ నగలు కాజేసిందీ వివరించి ఆమె నోరుకు సీలు వేద్దును. కనీసం రామానుజం అన్నయ్యలో పరకాయ ప్రవేశం చేయగలిగినా ఈ ఇంగితం అతగాడికి కలిగించి ఈ బృహత్తర కార్యక్రమాలు జరిపిద్దును" అన్నాడు ఆవేశంగా.

ఊర్మిళకు రామచంద్రం వస్తే మనసుకి హాయిగా వుంటుంది.

తోబుట్టువులు ఎవరూ లేని తనకి రామచంద్రం తోబుట్టువు. తన ఆస్తి మీద ప్రేమతో అనసూయమ్మ పెద్దమ్మ చూపిన కొద్దిపాటి ప్రేమ నటన, తన పెళ్లి విషయంలో విరిగి పోయింది పూర్తిగా. సీతక్క సరే సరి. ఆగర్భ శత్రువులానే చూస్తుంది నేటికీ. శ్రీనివాసానికి ప్రత్యేకం శత్రుత్వం మిత్రత్వం లేదు తనపట్ల. వాడి సినిమాలూ, షికార్లూ, సినిమా

స్టూడియో చుట్టూరా వేషాల కోసం తిరగటాలూ అలా చెడిపోయాడు బొత్తిగా. రామచంద్రం ఒక్కడే తనని ఆత్మీయంగా చూచుకుంటాడు. అలా రామచంద్రం అంటుంటే నవ్వి...

"పోన్లే రామచంద్రం! ఎవరి కర్మ ప్రకారం వాళ్లకు జరుగుతుంది" అంటుంది.

"ఆ మాటంటే నాకు కోపం వస్తుంది ఊర్మిళా! కర్మేమిటి? నీ ఆస్తి జల్సా చేస్తూ నిన్ను చులకనగా చూస్తాడు నీ భర్త రామానుజం. నీ ఆస్తిలో పడి తింటూ ఆ మాలతి అత్తింట వుండి, భర్తను అనుసరించుకు పోవలసినది, దాని పిల్లల పనులు కూడా అది చేసుకోలేని ఒళ్ళు బలిసిన తత్వంతో సీతతో కలిసి నిన్ను ఆడిపోసుకుంటోంది. అది ఉంటున్న ఈ ఇల్లు దాని బాబుగాడి సొమ్ము కాదు, నీది. నీ పిత్రార్జితం. నువ్వు మెడబట్టి గెంటితే అవతలికి పోవలసిన అది నిన్ను వంకలు పెడుతోంది.

ఇక మీ అత్తగారు సుభద్రమ్మగారు... ఆపసోపాలు అరువు తెచ్చుకుని నిన్ను కాల్చుకు తింటోంది. నువ్వు ఉద్యోగంలో చేరి మంచిపని చేశావు. ఈ నరకం నుంచి కొంత రిలీఫే. రామానుజం అన్నయ్యని వో దులుపు దులపనా?"

"ఒద్దు రామచంద్రం! ఆయనగారు నా భర్త అనే సంగతి గుర్తుంచుకో" అంది ఊర్మిళ కోపంగా.

రామచంద్రం పకపక నవ్వుతాడు. "ఈ పాతివ్రత్యమే నీ పీకల మీదికి తెస్తోంది ఊర్మిళా! ఆయనగారి మీద ఈగ వాలనివ్వవు. సీత చూడు. నరసింహం అన్నయ్యని నానాగడ్డీ తినిపిస్తోంది ఈ మధ్య. అసలే చవట అయిన ఆయన్ని 'రంకు రాక్షసుడి' గా అభివర్ణించి తరిమి తరిమి చంపుతోంది."

అదీ నిజమే! నరసింహానికీ, మరెవరో స్త్రీకీ అక్రమ సంబంధం ఉందంటూ యాగీ చేస్తోందీ మధ్య సీత. తరచూ అలిగి తల్లితో సహా ఊర్మిళ ఇంటికి వచ్చి పదేసి రోజులుంటి వెళుతోంది,

ఊర్మిళ ఉద్యోగంలో చేరాక...

మొదటి సారి గర్భిణి అయ్యింది. చాలా సంతోషించింది ఊర్మిళ. తనకూ వో బుల్లి పాపో, బాబో పుడితే వాడితో కాలక్షేపం. ఈ ఉద్యోగం అవసరం వుండదు. నా అంటూ ఏమీ లేదన్న నిస్పృహ నుంచి తనని తాను రక్షించుకునేందుకే ఈ ఉద్యోగం సృష్టించుకుంది.

రామానుజం బాగా మారిపోయాడు. అతగాడి సంపాదన అతగాడి జల్సాలకు సరిపోవటం లేదీమధ్య. ఫ్రెండ్స్ తో పార్టీలు, వెట్ పార్టీలు... ఓ మోస్తరు 'ఉమన్ వీక్ నెస్' స్థాయికి ఎదిగి పోయాడు. అయితే అవి ఇంకా ఇంట్లో వారికి తెలిసేంతవరకూ రాకుండా జాగ్రత్త పడుతున్నాడు.

“అప్పుడే మనకు పిల్లలేమిటి ఊర్మిళా! ఈ మాలతి ఒకర్తె, దాని పిల్లలతో శాశ్వతంగా మన నెత్తిమీదే వుండి పోయింది కదా! దాన్ని పంపుదామంటే మా అమ్మ వురేసుకుంటాను అంటోందా? నిజానికి రాఘవ బావ ఇప్పుడు వేరు పోయాడు కదా? ఇది గ్రామంలో భర్తతో వంటరి కాపురం వెలగ బెట్టొచ్చు కదా. కానీ వెళ్ళదు. సుఖం మరిగిందిక్కడ. అక్కడ తనకీ, తన భర్తకీ పిల్లలకీ వండుకు తినే వోపిక లేదిప్పుడు. మరేమంటే ‘పిల్లల చదువులు’ అని సాకు పెడుతోంది.

నా నెల జీతం ఇంటి ఖర్చులకు చాలటం లేదు నీ సంపాదన అత్యవసరం అనిపిస్తోందిప్పుడు. వున్న ఇల్లొక్కటీ అమ్ముకుంటే ఎన్నేళ్ళు వస్తుంది? ఇప్పుడు అబార్షన్ చేయించేస్తాను. మరో రెండేళ్ళు పోయాక చూద్దాం, మనకు పిల్ల విషయం. మా అమ్మ మంచంలో పడటమో, మరణించటమో జరిగితే తప్ప మాలతి మనల్ని వదలి వెళ్ళదు. అందాకా మనకు ఏ అదనపు భారం వద్దు” అన్నాడు.

ఊర్మిళ నిర్ఘాంతపోయింది. అబార్షన్!

తనకిది అక్రమ సంతానం కాదు! ఏ ఐదో బిడ్డో, ఆరో బిడ్డో అనే భారమైన సంసారమూ కాదు. తొలిసారిగా గర్భం ధరించింది. భర్త చెబుతున్న సాకులకు అర్థం ఉందా?

మాలతి, మాలతి పిల్లల కోసం, అత్తగారి కోసం, ఇంటి ఖర్చుల కోసం తమకి పిల్లలు వద్దా?

“పోన్లెండి. మరోసారి రాకుండా రాకుండా జాగ్రత్త పడదాం. తొలిసారి...” ఊర్మిళ నచ్చ చెప్పబోయింది.

ససేమిరా అన్నాడు రామానుజం. భర్తగా తన మాట విని తీరాల్సిన బాధ్యత భార్యగా ఊర్మిళకుంది అన్నాడు.

ఊర్మిళకు అంత నిర్లిప్తత లోనూ నవ్వొచ్చింది.

భార్య... బాధ్యత.

భర్త బాధ్యతలు?

తన తండ్రి తాలూకు చివరి పైసా వరకు తన చేత సంతకాలు చేయిచుక తీసుకుంటుంటే, భార్య బాధ్యతగా పల్లెత్తు మాట అనలేదు. షుమారు పదేళ్లుగా కుటుంబ సభ్యులందరికీ బానిసలా చాకిరీ చేయటం బాధ్యతగానే స్వీకరించింది. ఉద్యోగం చేస్తూ ఇంటిపని చేస్తూ ద్విపాత్రాభినయము బాధ్యతనే అనుకుంది.

చివరికి ఈ నాడు ఓ చీర కొనుక్కోవాలన్నా, ఓ పైసా ఖర్చు పెట్టాలన్నా, తనది అంటూ తనకేమీ లేదు. తను ఉద్యోగం చేసి తెచ్చే జీతమూ ఇంటి ఖర్చులకే. అది తను స్వతంత్రంగా వాడుకొనేందుకు లేదు. ఇవన్నీ బాధ్యతలనే అనుకుంది.

కానీ... ఓ బిడ్డ కావాలనుకున్నప్పుడు గర్భం ధరించాక వృధాగా అబార్షన్ చేయించుకోమనటం... అది నెరవేర్చటం భార్యగా తన బాధ్యత!

ఆ సాయంత్రం రామచంద్రం వచ్చాడు. రామచంద్రానికి డాక్టర్ కోర్సులో మరి కొంత సాయం చేయటమే గాక తన కూతురు సుమతినిచ్చి పెళ్లి చేసారు విజయవాడలోని ఓ పెద్ద డాక్టరు.

ఇప్పుడు రామచంద్రం సుమతిలు కూడా హైదరాబాదులోనే వుంటున్నారు.

చెప్పింది ఊర్మిళ.

రామచంద్రం కూడా నిర్ఘాంతపోయాడు.

రామానుజం తన పట్టు సడలించుకోడని తెలుసతగాడికి,

“ఊర్మిళా! నా క్లాసుమేటు డాక్టర్ లలిత వుందిక్కడే. ఆమె దగ్గరికి రా. నీ పతిదేవుడికి ఆమెని పరిచయం చేస్తాను. మంచి డాక్టరు. జాగ్రత్తగా నీ ఆరోగ్యం దెబ్బతినకుండా చేస్తుంది అబార్షన్” అన్నాడు రామచంద్రం ఆవేదనతో.

ఆ సాయంత్రమే రామానుజం, ఊర్మిళలు డాక్టర్ లలిత దగ్గరకు వెళ్ళారు.

అంతక్రితమే రామచంద్రం ద్వారా ఊర్మిళ గురించి విని వుండటం వల్ల ;ఆలిత ఎక్కువ పరిచయం అవసరం లేకుండానే ఊర్మిళను చాలా ఆదరంగా చూచింది. అబార్షన్ చేసింది. వారంతోజులు లలితా నరింగ్ హోంలోనే వుండి పోయింది ఊర్మిళ,

ఆ వారం రోజుల్లోనే ఊర్మిళ లలిత బాగా సన్నిహితులయి పోయారు. ఎంతో ఆత్మీయులయి పోయారు.

డాక్టర్ లలిత ఓ లక్షాధికారి ఏకైక కుమార్తె! ఆమె డాక్టర్ కోర్సు చదువుతుండగా ఆమె మేనబావతో పెళ్లి జరిగింది. అతగాడూ డాక్టరు. అయితే రెండేళ్ళ కోర్సుంది లలితకు. ఈ లోగా ఫారిన్ లో వుండి అదనపు డిగ్రీని తెచ్చుకుంటానని కొన్ని స్పెషలైజ్ చేస్తాననీ వెళ్ళాడా బావ.

వెళ్ళినవాడు రెండేళ్ళు దాటాక అంతు లేదు సరికదా, అక్కడే మరో అమెరికన్ లేడీ డాక్టరుని (స్టూడెంట్ ని) పెళ్ళాడి స్థిరపడిపోయాడు. ఏం చేయటానికీ తోచలేదు ఆలిత తల్లి తండ్రులకి.

డాక్టర్ రామచంద్రం లలిత క్లాసుమేటు. బాగా స్నేహితుడు కూడా.

“వివాహ బంధాన్ని ఇంత తేలిగ్గా తెంచి పారేసే ఆ బావ... భర్త అసలు లేడనుకో. వున్నా చనిపోయాడనుకో. నీ నూరేళ్ళ జీవితం నాశనం చేసుకోకు లలితా. నా లాయర్ ఫ్రెండు ఒకడున్నాడు. ముందస్తుగా నీ భర్తగాడికి విడాకుల నోటీసు యిచ్చెయ్యి” అని ప్రోత్సహించి లాయర్ రాజుతో పరిచయం చేశాడు.

లలిత తలిదండ్రులని లలితకు మరో పెళ్లి చేయటానికి ఒప్పించాడు.

“బహుశా మా మిడిల్ క్లాసులో ఇదే సంఘటన ఇలా జరిగితే, ఇక ఆ అమ్మాయికి మరో పెళ్లి చెయ్యటానికి ఇంత తేలిగ్గా ఒప్పుకోరని నాకు తెలుసు. పిల్ల జీవితం నాశనమయి పోతున్న బాధ కంటే లోకులేమనుకుంటారన్న ఫాల్స్ ప్రెస్టీజు కోసం ఏడుస్తారు.

అతి తక్కువ తరగతుల్లో భర్త వదిలేస్తే ఆ భార్య పిల్లలున్నా సరే, మరో మనువాడటానికి ఏ అభ్యంతరమూ లేదు. పిల్ల తల్లిని, పిల్లలతో సహా స్వీకరించటానికి కించపడరు ఆ వర్గంలో మగవారు.

మీ లాటి లక్షాధికారులు ఏం చేసినా నోరెత్తదు లోకం.

ఎటొచ్చీ మా మధ్య తరగతికే అన్ని సమస్యలూనూ. కాబట్టి లలితా! రాజుని పెళ్ళాడాక సాంఘిక న్యాయం కోసం లాయర్ గా రాజు, వ్యక్తిగత అనారోగ్య బాధలు తొలగించటానికి డాక్టర్ గా నువ్వూ కలిసి కృషి చేయండి” అన్నాడు రామచంద్రం నవ్వుతూ.

వాళ్ళిద్దరి పెళ్లి జరిపించాడు.

హైదరాబాదులోనే డాక్టర్ లలిత, లాయర్ రాజు బాగా ప్రాక్టీసు పుంజుకున్నారు. రామచంద్రం, సుమతి, రాజు లలిత ఒకే కుటుంబంలోని వ్యక్తులుగా కలిసి పోయారు.

ఊర్మిళకి ఇదంతా లలితే చెప్పింది.

“నువ్వంటే మా రామచంద్రానికి ఎంత అభిమానమో చెప్పలేను ఊర్మిళా! రోజూ ఓసారి నీ గురించి చెబుతుంటాడు” అనికూడా అంది.

లలితా, రాజులది అన్యోన్య దాంపత్యం.

ఆ తర్వాత రెండు మార్లు మరలా రామానుజం ఊర్మిళకు అబార్షన్ చేయించాడు.

"ఛ... ఏం భర్త రామచంద్రం! ఆ రామానుజానికి చాలా సుఖవ్యాధులూ వున్నాయి. ఊర్మిళకూ ఆ వ్యాధులు సోకుతున్నాయి" అంటూ బాధపడింది లలిత.

ఆ తర్వాత వరసగా నాలుగు మార్లు వాటంతటవే అబార్షన్లు కావటం మొదలెట్టాయి ఊర్మిళకి. చాలా బలహీనంగా మారిపోయింది ఊర్మిళ.

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

Post your comments